కథ

# పసి మనసు

- రాయప్రోలు రామచంద్రమూర్తి

**ఎప్పుడో** తెల్లారినప్పటికీ సిటీకి మటుకు తెల్లారి గంటే అయింది. బద్ధకంగా పడుకున్న సింహం జూలు విదిల్చి లేడి వెంట క్షణంలో పరుగందుకున్నట్లు సిటీవాసులు ఈ గంటలోనే ఎన్నో పనులు ముగించుకుని రోడ్డు మీదికి వస్తున్నారు. టిఫిన్లు తిని ఆఫీసులకెళ్ళే వాళ్ళూ, కూలీపన్లకి వెళ్ళేవాళ్ళు ఆ నాలుగు రోడ్ల కూడలి దగ్గర ఉన్న ఫాస్ట్ ఫుడ్ తోపుడు బండి దగ్గరకి చేరుకుంటున్నారు.

ఆ బండి రాములుది. అతని భార్య కళావతి, కొడుకు 10 ఏళ్లవాడు శీను ముగ్గురూ ఎవరికి వీలైనంత వేగంగా వారు పని చేస్తున్నారు. రాములు దోశలు వేయడం, వడలు నూనెలో వేయిస్తుండడం, ఇడ్లీలు తయారవ్వగానే బయటికి తీసి కాసరోల్‌లో వేయడం అనే మూడు పన్లని రెండు కళ్ళతో అనుక్షణం గమనిస్తున్నాడు. కళావతి వాటి ప్యాకింగు, డబ్బులు తీసుకోవడం చేస్తుంది. న్యూస్ పేపర్‌ని సమానంగా చింపడం, వాళ్ళమ్మకి అందించడం, పార్శిళ్ళని క్యారీ బ్యాగ్‌లలో వేయడం, గిరాకీలకి అందించడం, చిల్లర లేకపోతే పక్క షాపుల్లోకి వెళ్ళి తేవడం, వారంలో ఏడు రోజులూ పొద్దున్న 7 నుంచి 9 వరకు ఇదే డ్యూటీ. 9 గంటలకి బ్యాగు సర్దుకుని శీను పక్కనే ఉన్న సందులోకి వెళ్ళి ఆ తర్వాత కొన్ని గొందులు తిరిగి గవర్నమెంటు స్కూల్‌కి వెడతాడు. వెడుతూనే ఉంటాడు 'మధ్యాహ్న భోజన పథకం' ఉన్నంత కాలం.

ఎప్పటిలానే ఆరోజూ తెల్లారింది. ఐతే రోడ్డు మీదికి మటుకు జనాలు పెద్దగా రావట్లేదు. రాములు వ్యాపారం కూడా రోజూలా లేదు. కారణం ఆరోజు ఆర్టీసీ స్ట్రైక్. వాహనాల మీద వెళ్ళే వాళ్ళు మాత్రమే వచ్చి కొందరు అక్కడే టిఫిన్లు తిని, మరికొందరు పార్శిళ్ళు కట్టించుకుని వెడుతున్నారు. శీనుగాడికి అంత తీరిక ఎప్పుడూ లేదు. బొమ్మలు చూస్తూ పేపర్లు చింపుతున్నాడు. అనుకోకుండా వాడి దృష్టి తెల్లటి బొచ్చుకుక్క బొమ్మ మీదికి పోయింది. పైన 'తప్పిపోయింది' అని రాసి వుంది. కింద దాని పేరు, వివరాలు, తెచ్చిచ్చిన వారికి బహుమతి అని రాసి వుంది. అది చదవగానే వాడి మనసులో ఒక ఆలోచన తళుక్కున మెరిసింది. వాడి తల్లీదండ్రీ కన్ను గప్పి క్షణంలో అక్కడి నుంచి మాయంవయ్యాడు.

"శీనూ చాయ్ జెప్పిరారా" అంటూ రాములు అటు చూసే సరికి శీనుగాడు కనిపించలేదు. ఇక్కడే ఎక్కడో ఉండి ఉంటాడనుకుని వాళ్ళిద్దరూ పట్టించుకోలేదు. కాసేపైనాక అనుమానం వచ్చి అన్నాడు.

"గీడేడే "

"నేన్బి గదే జూస్తున్నా" అంది.

"సూస్తున్న అంటే ఎట్లనే, దేవులాడు. గింతసేపాయ్" వెంటనే బయలుదేరింది కళావతి. ముందుగా నాలుగడుగుల దూరంలో ఉన్న పెద్ద రావిచెట్టు వెనక్కెళ్ళింది. దానికి కట్టిన గట్టుమీద వాడు అప్పుడప్పుడు పడుకుంటాడు... లేడు! ఇరానీ హోటల్ దగ్గర చూసింది... కూల్ డ్రింక్ మూతలు ఏరుకుంటున్నాడేమోనని.... అక్కడా లేడు!! గుడిలో ప్రసాదం కోసం వెళ్ళాడేమోనని చూసింది. ఆతృతతో గుండె వేగం పెరిగింది. "దేవుడా! నా పిల్లగాన్ని నా తాన్కి జేర్చు" అని మొక్కుకుని బండి దగ్గరకి వచ్చేసింది. విషయం అర్థమైంది రాములుకి. "నువ్వు ఇస్కూల్ల జూషి ఇంటికి రా. ఈలోపట నేను బండి బెడ్త" అని దగ్గరే ఉన్న అంబేద్కర్ నగర్‌లోని ఇంటికి దారి తీశాడు. పది నిముషాల తర్వాత కళావతి వచ్చి స్కూల్లో గూడ లేడంది.

ఇహ ఇద్దరూ బస్తీలో మరో ఇద్దరు కుర్రాళ్ళనేసుకుని అడుగడుగునా గాలించారు. సాయంత్రం అయ్యాక వట్టి చేతులతో ఇల్లు చేరారు. వస్తూనే కాలనీ పెద్ద దగ్గరికి వెళ్ళారు. "మీరిప్పటి వరకు పోలీసులకి ఎందుకు చెప్పలేద"ని వెంటనే తీసుకెళ్ళాడు రిపోర్టిప్పించడానికి. వీళ్ళ రిపోర్టు చదివిన వెంటనే" ఉండండి! మాకు ఇప్పుడే ఇంకో

✳

కుక్కపిల్ల కన్పించకపోతే
పేపర్లో వేయించే
తాహతున్నవారు, పిల్లాడు
కనిపించకపోయినా పేపర్లో
వేయించలేని వారు కూడా
ఉంటారని ఆ పసిమనసుకి
తెలీదు.

✳

స్టేషన్ నుండి సమాచారం వచ్చింది ఒక పిల్లాడు దొరికాడని" అంటూ రిపోర్టు ముందు పెట్టుకుని మళ్ళీ అదే పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేశారు. రెండింటి వివరాలు సరిపోయినయ్. అరగంటలో వాళ్ళ దగ్గరున్నాడు శీనుగాడు.

ఇద్దరూ వాణ్ణి దగ్గర తీసుకుని గుండెలకి హత్తుకున్నారు. బావురుమని ఏడ్చారు. ఇంటికి తెచ్చుకున్నారు. వాడు బాగా ఏడ్చినట్లు ఉబ్బిన కళ్ళూ, లేత బుగ్గలపైన చారికలు చూస్తే తెలిసిపోతోంది. పిల్లాడు ఎర్రగా ఉంటాడని చుట్టు పక్కల వాళ్ళు తెగ ముద్దు చేస్తారు. వాళ్ళంతా వచ్చి మురుక్కులు, బిస్కెట్లు, ఐస్‌క్రీమ్ పెట్టబోయారు. వాడేదీ తినలేదు. వాళ్ళమ్మ కలిపి ఇచ్చిన పెరుగన్నం తినీ తినగానే అలసటతో నిద్రపోయాడు.

మర్నాడు పొద్దున్న రోజులాగే ఉత్సాహంగా లేచాడు. ఆదివారం కావడంతో అందరూ తీరిగ్గా వాడి చుట్టూ చేరారు. శీనుగాణ్ణి "యాడబోయ్‌నవ్‌రా" అన్న ప్రశ్నకి వాడు ఇలా చెప్పాడు.

"పేపర్లు జింపుతావుంటి. గప్పుడు అండ్ల ఒక కుక్కపిల్ల బొమ్మ గన్పించింది. గండ్లేం రాశిన్రంటే గీ కుక్క తప్పిపోయింది. దాని పేరు డాలీ. తెల్లగుంటది. ఎవల్కైనా దొర్కితే మాకు జప్పుండ్రి! పైసలిస్తం అని రాశుంది. ముందు దాన్ని ఎత్కుదమనే మీకు జెప్పకుంటా మెల్లిగా ఎల్లిపోయినా. యాడబి గన్పియ్యలే. చానాసేపైనంక సుట్టు జూస్తే అంతా కొత్తగ గొట్టింది. నువ్విచ్చిన రూపాయ్‌తోని సోడా దాగిన. ఎవ్వల్ బి నన్ను గుర్తుపడ్తలేరు.

"మనొసంటి బండోల్లతాన్కి బొయ్యి జెప్పకుంటివి" అన్నాడు రాములు.

"గాడసొంటివి లెవ్వు. చాలా గుబులైంది. గింతల అన్మంతుని బొమ్మ ఒకాయన రోడ్డుమీద ఏషిండు. దేవున్కి మొక్కుకున్న. గప్పుడు యాదొచ్చింది నాకు. కుక్కపిల్ల దప్పిపోతే పేపర్లేషినట్లే నా బొమ్మబీ పేపర్లొస్తది మంచిగ సూడొచ్చు అన్కొని నాయనగన్పించినా పిల్వలే" అన్నాడు.

వాడిది అమాయకత్వమో, తెలివితేటలో అర్థంకాక చుట్టుపక్కల వాళ్ళు బుర్ర గోక్కున్నారు. కుక్కపిల్ల కన్పించకపోతే పేపర్లో వేయించే తాహతున్నవారు, పిల్లాడు కనిపించకపోయినా పేపర్లో వేయించలేని వారు కూడా ఉంటారని ఆ పసిమనసుకి తెలీదు.

**రంజని నిర్వహించిన రాయప్రోలు రామకృష్ణయ్య స్మారక ఉగాది కథల పోటీలలో ప్రథమ బహుమతి పొందిన కథ.**